ప్రజాశక్తి

సోమవారం 29 మే 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఉపాధ్యాయుల

బదిలీలపై కసరత్తు

- 5 నుంచి ప్రక్రియ మొదలు
- 4న ఖాళీలు చూపించేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు కసరత్తు కొనసాగుతోంది. విద్యాశాఖ అధికారులు ఇదే పనిలో ఉన్నారు. జిల్లాలో ఎనిమిది ఏళ్లుగా ఒకే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇప్పుడు బదిలీలకు అవకాశం ఉంది. కోరుకున్న స్థానాలకు వెళ్లడానికి అర్హత ఉంది. మిగతా ఉపాధ్యాయులకూ అవకాశం ఉన్నా కోరుకున్న స్థానాలు దొరికితేనే వెళతారు. లేకుంటే అక్కడే ఉంటారు. ఏదేమైనా ఇప్పుడు ఉపాధ్యాయులు బదిలీల ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు ఎనిమిది వేల మంది వరకూ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు సీనియారిటీ ప్రకారం స్థానాలు వస్తాయి. పదోన్నతులు వచ్చే వారి జాబితా కూడా తయారుచేస్తున్నారు. వీళ్లు పనిచేసే స్థానాల నుంచి బయటకు వెళ్లాలంటే ఉద్యోగోన్నతిపైనే వెళతారు. ఉద్యోగోన్నతి వద్దనుకుంటే అక్కడే ఉంటారు. దీన్ని బట్టి ఉద్యోగోన్నతుల జాబితా కూడా తయారుచేస్తున్నారు. ఉద్యోగోన్నతులు పొందినవారూ, బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులూ ఇద్దరూ వచ్చే నెల ఐదు నుంచీ ఆప్షన్లు పెట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగానే ఖాళీలు కూడా చూపించాలి. ఎంతమంది ఉపాధ్యాయులు ఇప్పుడు బదిలీలకు, పదోన్నతులకు అంగీకరిస్తారో అన్ని స్థానాలూ ఖాళీలు అవుతాయి. వాటినే బదిలీల ప్రక్రియలో ఖాళీలుగా చూపుతారు. వాటిని ఉపాధ్యాయులు కోరుకుంటారు. ఈ నెల 4వ తేదీకి ఖాళీలెన్ని అనేదీ తేలిపోనుంది. అదేరోజున వాటిని ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచుతారు. ప్రస్తుతం పనిచేసే పాఠశాలల నుంచి తమకు అనుకూలంగానూ, నివాసం ప్రాంతాలకు దగ్గరలో ఉన్నత పాఠశాలలకు వెళ్లేందుకు ఎంచుకుంటారు. పట్టణాలకు దగ్గరలో ఉన్న పాఠశాలలకు మంచి డిమాండ్ ఉంటుంది. తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఉపాధ్యాయులు జిల్లాలో ▶ 2లో

తారెత్తిస్తున్న రోహిణి కార్తె..

- ఉక్కపోత..ఆపై కరెంట్ కోత
- పెరిగిన వడగాలుల తీవ్రత..
- విలవిలలాడుతున్న జనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎండల తీవ్రత మరింత ఎక్కువైంది. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభమవడంతో వడగాలుల ప్రభావం పెరిగింది. జనం బయటకు రావాలంటేనే భయపడి పోతున్నారు. ఉక్కపోత, ఆపై కరెంట్ కోత ఊపిరి సలపనివ్వడం లేదు. రెండు వారాల పాటు రోహిణి తారెత్తించనుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే ప్రకాశం జిల్లావాసులు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. ఇవి మరింతగా పెరగనున్నాయని ఆందోళన చెందుతున్నారు.

మండే ఎండలో గొడుగులు వేసుకొని వెలుతున్న మహిళలు

జిల్లాలో 42 డిగ్రీల ఎండలతో పేదలు, సామాన్యులు విలవిలలాడిపోతున్నారు. మండుతున్న ఎండలకు తోడు విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడంతో అప్రకటిత కరెంటు కోతలు మరింత వేధిస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా కోతలు కొనసాగుతున్నాయి. ఎండలు మండుతున్న వేళ మిట్టమధ్యాహ్నం సమయంలో కరెంట్ కట్ చేస్తుండటంతో ఇళ్లల్లో ఉంటున్నవారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గంటల తరబడి ఎల్ఎల్ఆర్ ఇస్తున్నారు. మరో వైపు రాత్రుల సమయాల్లో సైతం రెండు నుంచి మూడు గంటల పాటు విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. పల్లెల్లో అయితే సమయపాలన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ రోహిణీకార్తె కొనసాగనుంది. కార్తెలో ఎండలకు రోళ్లు పగిలే ఎండలు ఉంటాయి అనే నానుడి ప్రచారంలో ఉండడంతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేక పోతుంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు అల్లాడిస్తున్నాయి. ఈ రెండు వారాల పాటు వేడిగాలులు, ఎండ తీవ్రత, అగ్ని ప్రమాదాలు, ఉక్కపోతలు పెరుగుతాయి. ఎండ తీవ్రతకు శరీరం అలసిపోతూ ఉంటుంది. ఆరోగ్యరీత్యా తగు శ్రద్ధలు తీసుకోవాలని, ఎక్కువ నీళ్లు తాగడం, మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

సామాన్యులు విలవిల..

పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలు ఈ ఎండలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెక్కాడితేనే డొక్కాడని సామాన్యులే ఎక్కువగా ఎండ తీవ్రతకు గురవుతున్నారు. వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారులకు ఎండల అవస్థలు తప్పడం లేదు. పొట్ట నింపుకోవడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో చిరు ఉద్యోగాలు చేసే వారు ఎండల్లోనే తిరుగుతున్నారు. ఉపాధి వేటలో పలువురు తప్పనిసరి పరిస్థితుల్లో పండ్లు, పూలు, కూరగాయలు, ▶ 2లో

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

'మణిపూర్'లో ఆదివాసీ తెగలపై

దాడులు ఆపాలని నిరసన ప్రదర్శన

▶ 8లో

నేడు ఒంగోలులో

జర్నలిస్టుల డిమాండ్స్ డే

▶ 8లో

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-కొల్లూరు

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే జనం బతకడం కష్టమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి తెలిపారు. కొల్లూరు మండల పరిధిలోని కిష్కిందపాలెం ఎలిమెంటరీ స్కూల్లో రేపల్లె, వేమూరు సిపిఎం నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ఇందులో భాగంగానే మణిపూర్‌లో గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టిందన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి.. రెండూ బిజెపికి అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, నాయకులు టి.కృష్ణమోహన్, మణిలాల్, జి.సుధాకర్, బి.అగస్టీన్, బొనిగల సుబ్బారావు, వేములపల్లి వెంకటరామయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

పోలీసు సిబ్బంది కోసం

సబ్సిడీ క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో నిత్యావసర సరకుల సబ్సిడీ క్యాంటీన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు అనువుగా ఉండే స్థలాన్ని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుండి పోలీస్ సంక్షేమం కోసం నిరంతరంగా చర్యలు తీసుకుంటూ.. అవసరమైన ప్రతి ఒక్క సౌకర్యాన్ని సమకూర్చుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. జిల్లాలోని పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు సంక్షేమం కోసం అంచెలంచెలుగా ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ఆచరణలోకి తీసుకువస్తున్నామన్నారు. అందులో భాగంగా జిల్లా పోలీస్ సిబ్బంది వారి కుటుంబసభ్యుల సౌకర్యార్థం వారి అవసరాల కోసం సబ్సిడీ క్యాంటీన్ ఏర్పాటుచేయడానికి నిశ్చయించుకున్నామన్నారు. అందుకు అనువైన స్థలంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలం ఎంచుకున్నామన్నారు. త్వరలోనే ఆ స్థలంలో సబ్సిడీ క్యాంటీన్ తాత్కాలికంగా నిర్మించి జిల్లా పోలీస్ ఉద్యోగస్తులు వారి కుటుంబ సభ్యులకు అవసరమయ్యే నిత్యావసర సరకులు ఒకే చోట తక్కువ రేటుకు దొరికే విధంగా ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్.బి ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంటీన్ ఏర్పాటు కోసం స్థలం పరిశీలిస్తున్న ఎస్‌పి

రారెత్తిస్తున్న రోహిణి కార్తె..

(మొదటిపేజీ తరువాయి)

వస్త్ర దుకాణాల్లో పనులు చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నారు.

బేరాలు రావడం లేదు..

షేక్ మియా సాహెబ్, పండ్ల వ్యాపారి, యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో తోపుడు బండిపై వివిధ రకాల పండ్లను విక్రయిస్తున్నాను. కొద్దిరోజులుగా ఎండలు ఎక్కువగా ఉండటంతో కస్టమర్లు రాక బేరాలు ఉండడం లేదు. రోజంతా ఎండలోనే ఎదురుచూపులు చూస్తున్న రూ.200 కూడా వ్యాపారం జరగడం లేదు.

పొట్టకూటి కోసం ఎండల్లో అవస్థలు

షేక్ చిన్నవలి, టైలర్, యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని బట్టల దుకాణంలోని ముందు భాగంలో మిషన్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. ఎండలు విపరీతంగా పెరగడంతో మిషన్ మీద కూర్చోలేక పోతున్నాను. దీనికి తోడు బట్టలు కుట్టించుకునే వారు కూడా కరువయ్యారు. గత్యంతరం లేక పని మానుకొని ఇంటి పట్టునే ఉంటున్నాను.

తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు..

పాలువాయి శకుంతల, గృహిణి, వేగినాటి కోటయ్య నగర్

ఎండ తీవ్రత బాగా పెరిగింది. రోహిణి కార్తి రావడంతో ఎండలు మరింత ఎక్కువైంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయటకు వస్తున్నాం. లేకుంటే ఇంటి పట్టున ఉండే చెట్ల కిందనే కాలం గడుపుతున్నాం. ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో వద్ధులు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధ్యాయుల బదిలీలపై కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

2,052 మంది ఉన్నట్లు గుర్తించారు. క్రమబద్ధీకరణ కారణంగా మరో 1500 మంది వరకూ స్థానచలనం కావాల్సి ఉంటుందని సమాచారం. అక్కడ పిల్లలు లేనందున సర్దుబాటు ప్రక్రియ కూడా చేస్తారు. ఇలా కూడా అనివార్యంగా బదిలీలు కావాల్సి వస్తోంది. ఏదో రూపంలో జిల్లాలో నాలుగు వేల మంది వరకూ బదిలీలకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా బదిలీలకు, పదోన్నతులకు అంగీకరించే వారి నుంచి సమాచారం సేకరిస్తున్నారు. వారి జాబితా సోమవారం నాటికి తయారుచేస్తారు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు వైద్యం కోసం, పిల్లల చదువుల కోసం పట్టణాలకు దగ్గరలో ఉండాలని కోరుకుంటున్నారు. ఉపాధ్యాయులు పనిచేసే గ్రామాల్లో ఉండటం తక్కువగా ఉంది. జిల్లా కేంద్రం నుంచే వంద కిలోమీటర్ల వరకూ బస్సుల్లో ప్రయాణించి సాయంత్రానికి తిరిగి వస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ కొందరు నివాసం ఉంటున్నారు. దగ్గరలో ఉండే పాఠశాలలకు వెళ్లి వస్తున్నారు. గ్రామాల్లో ఉండటానికి సరైన సౌకర్యాలు లేకపోవడం కూడా సమస్యగా ఉంది. పట్టణాల్లో అద్దెలకు ఇళ్లు దొరుకుతాయి. అందుచేత పట్టణాల్లోనే నివాసం ఉంటూ పాఠశాలలకు వెళ్లి వచ్చే ఉపాధ్యాయులే ఎక్కువగా ఉన్నారు. ఇపుడు వీరంతా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. దగ్గరలో ఉండే స్థానాల కోసం ఎదురుచూస్తున్నారు. పాఠశాలలు తిరిగి తెరిచేలోపే బదిలీల ప్రక్రియ ముగియనుంది.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలంలో గత రెండు నెలలు నుంచి తాగునీరు సక్రమంగా రాక ప్రజలు అల్లాడిపోతున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి కెవి.రత్నం తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కెవి.రత్నం మాట్లాడారు. గత రెండు నెలలుగా పొదిలి మండలంలో తాగునీరు సక్రమంగా రాక పోవడంతో మహిళలు రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు, రాస్తారోలు నిర్వహించినట్లు తెలిపారు. అయినప్పటికీ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించకపోగా తీవ్ర నిర్లక్ష్య ధోరణితో ఉన్నారన్నారు. కొందరు అధికారులు గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో కాపురం ఉంటూ అప్పుడప్పుడు వారానికి రెండు, మూడు రోజులు పొదిలికి విధులకు వస్తే ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రజల కలిసి పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 40 ఏళ్ల తరువాత గురువులకు సత్కారం

- భావోద్వేగానికి గురైన ఉపాధ్యాయులు



పూర్వ విద్యార్థులతో అప్పటి గురువులు

ప్రజాశక్తి-తెనాలి

దాదాపు 40 ఏళ్ల క్రితం వారంతా పదోతరగతి విద్యార్థులు. అప్పటి గురువులను, మిత్రులతో గడిపిన జ్ఞాపకాలు స్మరించుకోవాలనుకున్నారు. తలచిందే తడవుగా వృత్తి, ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారి చిరునామాలు, అప్పటి గురువుల సమాచారం కూడా సేకరించారు. ఎట్టకేలకు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో సమావేశమయ్యారు. బాపట్ల జిల్లా మండూరురెడ్డి ఉమామహేశ్వరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం వివరాలిలా ఉన్నాయి.

గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో చేరిన చుండూరు మండలం మండూరురెడ్డి ఉమామహేశ్వరరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. బ్యాచ్‌లోని వెన్నం కిషోర్, సీతారామయ్య, రేణుక, విజయ, ఎం.శేషగిరి సమిష్టి కృషితో బ్యాచ్‌లోని విద్యార్థుల వివరాలు సేకరించారు. అప్పటి ఉపాధ్యాయులు టి.వి.గురునాథం (సైన్స్), వెంకట్రావ్ (తెలుగు), బ్రహ్మానందం (మాథ్స్), మాచిరాజు రామకృష్ణమూర్తి (సోషల్), విజయకుమారి, సూర్యనారాయణ (పిఈటి) వివరాలు సేకరించి, వారిని కూడా సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భావోద్వేగానికి గురయ్యారు. 40 ఏళ్ల తరువాత ఒక వేదికపైన చేరిన పూర్వ విద్యార్థులంతా తొలుత వారి వృత్తి, ఉద్యోగం, కుటుంబ నేపథ్యాలను సభావేదికపై పంచుకున్నారు. ఈ సందదర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 40 ఏళ్ల తరువాత కూడా తమను గుర్తుపెట్టుకుని, వేదికపై చేర్చి సన్మానించటం మధురమైన అనుభూతిగా చెప్పారు. విద్యార్థులు సామాజిక సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలని తను నేర్పించానని, అదే స్ఫూర్తితో ఉద్యోగ విరమణ అనంతరం కూడా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ అధ్యక్షునిగా సేవలందిస్తున్నట్లు మాచిరాజు రామకృష్ణమూర్తి చెప్పారు. కుటుబంలో పిల్లలతోపాటు, పాఠశాల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తమవంతు కృషిచేసినట్లు టివి గురునాథం చెప్పారు. అప్పట్లో మ్యాథ్స్ ఉపాధాయునిగా తొలి పోస్టింగ్ పొంది, తనను తాను నిరూపించుకునే అవకాశం దక్కిందని బ్రహ్మానందం చెప్పగా, సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి పనిచేసే భాగ్యం దక్కిందని విజయకుమారి చెప్పారు. 40 ఏళ్ల తరువాత విద్యార్థుల చేతిలో సత్కారం పొందటం, వారి అభివృద్ధిని స్వయంగా వీక్షించటంలో ఎంతో సంతృప్తి ఉందని తెలుగు ఉపాధ్యాయులు వెంకట్రావ్ చెప్పారు. ఫిజకల్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను, తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన తీరును పీఇటీ సూర్యనారాయణ వివరించారు. పూర్వ విద్యార్థులు వెన్నం కిషోర్, సీతారామయ్య, శ్రీకాళహస్తి ఏపిట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.శేషగిరి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గురవులకు నూతన వస్త్రాలను బహూకరించి, సత్కరించారు. అప్పటి బ్యాచ్‌లో తమతోపాటు పదోతరగతి చదివి, మృతి చెందిన నలుగురు విద్యార్థులకు తొలుత వారంతా మౌనం పాటించారు. సభా కార్యక్రమం అనంతరం పూర్వ విద్యార్థులంతా మండూరులో వారు చదువుకున్న పాఠశాలను సందర్శించారు.

ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని పాములపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా రుగుతున్న పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి భోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు తమ్మిశెట్టి వెంకటయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జడ్‌పి మాజీ చైర్మన్ హరిబాబు

రాఘవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పాలకేంద్రం అధ్యక్షుడు, భక్తయ్య విజ్ఞాన కేంద్రం సభ్యులు మాగులూరి రాఘవయ్య అంత్యక్రియలు ఆదివారం నిర్వహిం చారు. తొలుత ట్రాక్టరపై ఊరేగింపుగా రాఘవయ్య మృత దేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు. రాఘవయ్య మృత దేహాన్ని పలువురు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకుడు ఎస్‌కె.మాబు, జె.జయంతి బాబు, టి. శ్రీకాంత్, జి. బసవపున్నయ్య, జడ్‌పి మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, వైసిపి నాయకుడు మారెళ్ళ బంగారుబాబు, టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్ , మాజీ ఎంపిపి వీరయ్య చౌదరి, గుమ్మడి సాయిబాబా, చుండూరి నాగేశ్వరావు, కనగాల శ్రీను, జాన్సన్, సెల్వం ఉన్నారు.

పాలకేంద్రం అధ్యక్షుడిగా....

రాఘవయ్య పాలకేంద్రం అధ్యక్షుడిగా గత 26 సంవత్సరాలుగా కొన సాగుతున్నారు. 5 సార్లు పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ చేశారు. పాల కేంద్రం భవన నిర్మాణం చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడిగా ఐదేళ్లు పనిచేశారు. ఆయన హయాం లోనే సొసైటీ బిల్డింగ్ నిర్మాణం చేపట్టారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామరాజు, మన్నం వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని కారుమంచి గ్రామానికి చెందిన ఎంవి. కష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ వైద్య సేవలు అభి నంద నీయమని కందులూరు గ్రామ సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ, గ్రామ సీనియర్ నాయకుడు ఉప్పలపాటి రామరాజు తెలిపారు. కందులూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంవి. కష్ణారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని సర్పంచి ఈశ్వరమ్మ, రామరాజు ప్రారంభించి మాట్లాడుతూ పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులతో గ్రామీణప్రాంతాల పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినంద నీయమన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతను దష్టిలో ఉంచుకొని అత్యాధునిక వైద్య పరికరాలతో మారుమూల ప్రాంతమైన కారుమంచి గ్రామంలో హాస్పిటల్‌ను నిర్మించి చుట్టుపక్కల పలు గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు. శిబిరం ఏర్పాటుకు సహకరించిన కందులూరు వైసిపి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రామరాజు, మన్నం వెంకయ్య ఎం.వి.కష్ణారెడ్డి ట్రస్టు ప్రతినిధులకు కందులూరు గ్రామస్తులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పలపాటి సత్యనారాయణ రాజు, రామిశెట్టి దాసయ్య, వికలాంగుల యూనియన్ నాయకులు పసుమర్తి ఆనంద్, రాజేష్, ప్రముఖ వైద్యులు చాట్ల మణికంఠ, చల్లగుండ్ల సాయికష్ణ, భారతిరెడ్డి, హాస్పిటల్ సిబ్బంది కష్ణారెడ్డి, కోటిరెడ్డి, మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

240 మందికి వైద్యపరీక్షలు

నాగులుప్పలపాడు : హైదరాబాద్‌కు చెందిన స్టార్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 240 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, విశ్రాంత హెల్త్ సూపర్ వైజర్ కె. ఎల్.నాగేశ్వరరావు, మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. భవిషత్తులోనే మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న మినీ వాహనం

పాస్టర్‌కు తీవ్రగాయాలు ● మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని టాటా ఏస్ వాహనం వాహనం ఢీకొన్న ప్రమాదంలో పాస్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు స్వల్ప గాయాలకు గురయ్యారు. ఈ ఘటన మార్టూరు మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో జరిగింది. బల్లికురవ 108 సిబ్బంది సురేష్, మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు సమీపంలోని నల్లపాడు వెంగళాయపాలెంలో ప్రార్థన మందిరం నడిపిస్తున్న ఆర్ ప్రసాదరావు నెల్లూరులో జరుగుతున్న ప్రార్థన కూటాలకు తన సంఘ సభ్యులతో కలిసి మందిరానికి చెందిన టాటా ఏస్ వాహనంలో హాజరయ్యారు. తిరిగి శనివారం అర్ధరాత్రి కూటాలు ముగిసిన అనంతరం తమ స్వగ్రామం వెంగలాయపాలెం తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం బొల్లాపల్లి టోల్ ప్లాజా దాటిన అనంతరం ఆగి ఉన్న లారీని గుర్తించక ఒక్కసారిగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పాస్టర్ ప్రసాదరావు కేబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డారు. ముందు కూర్చున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో టోల్ ప్లాజా సిబ్బంది అప్రమత్తమై టాటా ఏస్ వాహనంలో ఇరుక్కుపోయిన పాస్టర్‌ని అతి కష్టం మీద బయటకు తీశారు. సమాచారం అందుకున్న 108 బల్లికురవ సిబ్బంది క్షతగాత్రులను ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో పాస్టర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన పాస్టర్ ప్రసాదరావు

నీట మునిగిన ఇద్దరిని కాపాడిన సిబ్బంది

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల సూర్యలంక తీరంలో ఆదివారం జరిగిన రెండు సంఘటనలో ఇద్దరు వ్యక్తులను గజ ఈతగాళ్ళు, మెరైన్ సిబ్బంది, అవుట్ పోస్ట్ పోలీసు వారు కాపాడారు. మొదటి సంఘటనలో గుంటూరుకు చెందిన కాశీప్రసాద్‌ను కాపాడగా రెండో సంఘటనలో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట నివాసి అయిన పోతురం అనే యువకుడిని కాపాడినట్లు మెరైన్ సీఐ సుబ్బారావు విలేకరులకు తెలిపారు. పోతురం ఆదివారం తన ఇద్దరు స్నేహితులతో కలిసి బాపట్ల సూర్యలంక తీరంలో స్నానమాచరిస్తుండగా అలల ధాటికి సముద్రంలోకి కొట్టుకు వెళ్లాడు. ఇది గమనించిన సిబ్బంది వెంటనే గజఈతగాళ్లను రంగంలోకి దింపి యువకుడ్ని కాపాడారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు, అవుట్ పోస్ట్ పోలీసులు, మెరైన్ సిబ్బంది గజ ఈతగాళ్లను అభినందించారు. సూర్యలంక తీరానికి వచ్చే పర్యాటకులు సముద్రంలో స్నానమాచరించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా ఉన్న ప్రాంతంలో లోతుకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఆనందంగా ఆహ్లాదంగా పర్యటన ముగించుకొని క్షేమంగా ఇళ్లకు వెళ్లాలని సిఐ సుబ్బారావు కోరారు.

తాము రక్షించిన యువకుడితో సిబ్బంది, గజ ఈతగాళ్ళు

చిన్నారిని ఆశీర్వదించిన కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

హైమ హాస్పిటల్ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు కుటుంబ సభ్యులైన గుంటుపల్లి సుధాకర్‌రావు కుమార్తె వెంకట నాగ శ్రీలత పుష్పాలంకరణ వేడుకలకు చీరాల వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు, కామాక్షి హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు, పలువురు ప్రముఖులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. వేడుకలకు చీరాల ప్రాంతంలోని పలువురు ప్రముఖ వైద్యులు హాజరయ్యారు. వేడుకలలో పూర్వి హాస్పిటల్ ఎండి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మణ్‌రెడ్డి, దివి జయరావు, పలువురు నాయకులు, వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వెంకట నాగ శ్రీలతను ఆశీర్వదిస్తున్న కరణం వెంకటేష్

కన్నుల పండుగగా ఎడ్ల పందేలు

మొదటి బహుమతి అందజేసిన యువ పారిశ్రామికవేత్త ఆర్మీ విజయ్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం నరసాయిపాలెం గ్రామంలో మరియమ్మ తల్లి ఏసుక్రీస్తు స్వరూపాల 3వ ప్రతిష్ట సందర్భంగా రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పందేలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు వచ్చారు. పోటీల్లో గెలుపొందిన వారికి యువ పారిశ్రామికవేత్త ఆర్మీ విజయ్ నగదు బహుమతి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మీ విజయ్ మాట్లాడుతూ ప్రాచీన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంఘిక నాటికలు నిర్వహణతో గ్రామాల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొంటుందని ఆర్మీ విజయ్ తెలిపారు. సాంస్కతిక కార్యక్రమాలకు, సాంప్రదాయ క్రీడలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఎడ్ల పరుగు పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన స్టువర్టుపురానికి చెందిన బొచ్చు జయంతి ఎడ్లకు రూ.20,116 మెమొంటోను దాత ఆర్మీ విజయ్ అందజేశారు. రెండో బహుమతి పమిడిపాడుకు చెందిన నల్లమోతు హరీష్‌కుమార్‌కు రూ.15,116 మెమెంటో వైసిపి నాయకులు కళ్లం హరినాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ దాసి సుదర్శన్‌రావు, మూడో బహుమతి కేతిరెడ్డిపాలేనికి చెందిన చిరంజీవికి రూ.10,116 మెమెంటో చీమలదిన్నె శ్రీనివాసరావు, మాల్యాద్రి, 4వ బహుమతి నరసాయపాలేనికి చెందిన నక్క వీరయ్యకు రూ.5,116, మెమెంటో నరసాయపాలెం ఎంపీటీసీ దేవరపల్లి నాని జయమణిల సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసి కిషోర్, జంగా పేతురు, మామిడి సుందరరావు, మహేష్, పాదర్తి చిట్టి, దుగ్గిరాల చిన్నబ్బాయి, దేవరపల్లి చిలకయ్య, దాసి సుదర్శన్‌బాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పర్చూరు/యద్దనపూడి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన పర్చూరు-ఇంకొల్లు రోడ్డులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన ట్రాక్టర్ ట్రక్కు పంచర్ అవటంతో ట్రాలీని రోడ్డుపైనే వదిలేసి వెళ్లిపోయారు. చీరాల నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు పర్చూరు వైపు వస్తూ ఆగిన ట్రాక్టర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన సవరపు సాంసన్(29) మృతి చెందాడు. సాంసన్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు ఎస్ఐ చెంచు ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సవరపు సంసోను మృతదేహానికి యద్దనపూడి మండలం అనంతవరం గ్రామ ఉపసర్పంచ్ షేక్ శ్రీనివాస్ బాబు పూల మాల వేసి నివాళి అర్పించారు. మృతుడు శాంసన్ రోజు వారీ కూలీ. మృతునికి భార్య అరుణ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నివాళి అర్పించిన వారిలో 5,4 వార్డు సభ్యులు సుభాష్, మార్తమ్మ, గ్రామ నాయకులు తారక, ఎస్ వందనం ఉన్నారు.

సాంసన్‌కు నివాళి అర్పిస్తున్న ఉపసర్పంచి శ్రీనివాస్‌బాబు

రేకుల షెడ్డు దగ్ధం.. రూ.5 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-తర్లుపాడు

రేకుల షెడ్డు దగ్ధమై, రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. ప్రకాశం జిల్లా, తర్లుపాడు మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన కాలూరి ధనమయ్య రేకుల షెడ్డు ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటలకు చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న మార్కాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. వేసవి కాలం కావడంతో అప్పటికే రేకుల షెడ్డు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. విషయం తెలుసుకున్న తర్లుపాడు మండల తహశీల్దార్ వరకుమార్, విఆర్ఓ శామ్యూల్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను, స్థానిక ప్రజలను ప్రమాదం జరిగిన తీరుని గూర్చి అడిగి తెలుసుకున్నారు. జూన్ 5వ తేదీ తన కుమార్తె శుభకార్యం ఉన్నదని, ఆ శుభకార్యం కోసం ఇంట్లో తెచ్చి పెట్టిన రూ.70 వేల నగదు, బంగారం, వెండి నగలు మంటల్లో బూడిదయ్యాయని బాధితుడు కాలూరి ధనమయ్య కుటుంబం లబోదిబోమంటోంది. ప్రభుత్వమే తమకు నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

ప్రజాశక్తి-పంగులూరు

నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా, పంగులూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆదివారం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్స్ నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, 300 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు, ఉచిత వైద్య శిబిర సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, కిమ్స్ అద్దంకి ఏరియా పిఆర్‌ఓపి కాలేషావలి తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని పంగులూరు గ్రామ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కుర్ర వెంకటరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ బైపనేని రామాంజనేయులు, సుమారు 300 మంది రోగులకు షుగరు, బీపీ, ఈసీజీ, పరీక్షలు నిర్వహించి, అందరికీ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో కంటి లోపల శుక్లములు, పొరలు ఉన్నవారు సుమారు 25 మందిని ఎంపిక చేసి, వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంగులూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బాచిన త్రివేణి బాబు, బాచిన చౌదరిబాబు, బాచిన వీరేంద్ర, పంగులూరు గ్రామం మాజీ ఉపసర్పంచి నూతలపాటి అంజయ్య, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ బిల్ కలెక్టర్ మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని గుల్లపల్లి పంచాయతీలో మూడు దశాబ్దాలుగా బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బడుగు జ్యోతిరాజు(55) ఆదివారం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. పంచాయతీ పరిధిలో, మండల పరిధిలో అధికారులందరికీ, గ్రామస్తులందరికీ సుపరిచితమైన జ్యోతిరాజు మృతి పట్ల గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ చెన్ను శివ, మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, మాజీ సర్పంచి బాదావత్ పద్మ సాంబయ్య నాయక్, ఈవురి విజయబాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. జ్యోతిరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు.

బడుగు జ్యోతి రాజు (ఫైల్)

బావిలో దూకి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం చెరువు కట్ట పోయే దారిలోఉన్న బావిలో దూకి చిన్న కంభంకు చెందిన బండారు రంగస్వామి(32) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మృతునికి వివాహమై ఏడు సంవత్సరాల అయింది. ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల గొడవ కారణంగా రంగస్వామి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక పల్లపోతువారి బజారులోని సందులో నివాసం ఉంటున్న దొంతు శ్రీదేవి నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో రూ.2.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. శనివారం రాత్రి 12.30 గంటల సమయంలో దొంతు శ్రీదేవి, ఆమె కుమారుడు దొంతు సాయితేజ ఇంట్లో నిద్రిస్తున్నారు. విద్యుత్ సర్క్యూట్ జరిగి ఇంటినిండా పొగ నిండిపోయింది. బెడ్ రూములలో ఉన్న సామాను, మంచాలు కాలిపోయాయి. రెండు ఏసిలు కాలిపోయాయి. మంటలు వ్యాపించి, దట్టమైన పొగధాటికి శ్రీదేవి, సాయితేజలకు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. తలుపు లోపల తాళం తీయడానికి ప్రయత్నించినా తలుపు తీయలేకపోయారు. చుట్టుపక్కలవాళ్లు ఇంటిలోంచి వస్తున్న పొగలు చూసి, కిటికీ అద్దాలు పగులగొట్టి వారిని బయటకు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంటలు ఆర్పి శ్రీదేవిని, సాయితేజలను చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీదేవి, సాయితేజల పరిస్థితి విషమంగా ఉండడంతో వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో ఇరువురికి గాయాలు అయిన సంఘటన కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో జరిగింది. ఏఎస్ఐ జిలానీ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. పెదకండ్లగుంట గ్రామానికి చెందిన చెరుకూరి నరసింహం, కుమారుడు చెరుకూరి సురేష్ వీరు కొండపిలోని ఆర్టీసి బస్టాండ్ వద్ద జ్యూస్ పాయింట్ పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారు. శనివారం కూడా యథావిధిగా వ్యాపారం చేసుకొని రాత్రి 10.58 గంటలకు షాపు మూసివేసి తండ్రీ కొడుకులు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరి వెళుతున్నారు. కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో ఉన్న వెంకయ్యస్వామి గుడి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చిన కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో సురేష్‌కు తలకు, ముఖానికి, నరసింహంకు ముఖానికి, మోకాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళుతున్న వ్యక్తులు గమనించి క్షతగాత్రులను వెంటనే కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన తరువాత మెరుగైన వైద్యం కోసం 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. గాయాలపాలైన బాధితుల నుంచి ఏఎస్ఐ జిలాని బాషా వివరాలు తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు

నరేంద్రవర్మను సన్మానిస్తున్న చంద్రబాబు

నరేంద్రవర్మను సన్మానించిన చంద్రబాబు

ప్రజాశక్తి-బాపట్ల

గోదావరి తీరం రాజమహేంద్రవరంలో అత్యంత వైభవంగా పసుపు వర్ణ శోభిత మహానాడు నిర్వహణకు తమవంతు భూమిక నిర్వర్తించిన బాపట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మను టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఘనంగా సన్మానించారు. మహానాడు నిర్వహణలో అన్ని విధాల సహకరించి పార్టీ పటిష్ఠతకు రూ.5 లక్షలు విరాళాన్ని నరేంద్రవర్మ అందజేశారు. ఈ సందర్భంగా మహానాడులో ఏర్పాటు చేసిన విందుకు నరేంద్రవర్మను ప్రత్యేకంగా ఆహ్వానించి చంద్రబాబు నాయుడు ఆయనను దుశ్శాలువతో సన్మానించి అభినందించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన చంద్రబాబు నాయుడుకు నరేంద్రవర్మ శుభాకాంక్షలు తెలిపారు. బాపట్ల నియోజకవర్గం నుంచి రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడుకు హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు నరేంద్రవర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈ నెల 30వ తేదీన మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సంతమాగులూరు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాల్‌లో బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి అద్దంకి నియోజకవర్గం స్థాయిలో అవగాహన కార్యక్రమం జరుగుతుందని సిడిపిఒ డి సుధ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పాల్గొంటారని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో, బాల్యవివాహాలు తదుపరి పరిణామాలు, నిరోధక చట్టంపై అవగాహన కల్పిస్తారన్నారు. కావున నియోజవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని సిడిపిఒ కోరారు.

విద్యార్థులను అభినందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

విద్యార్థులకు విశ్వబ్రాహ్మణ సంఘం అభినందన

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కమిటీశ్వర స్వామి దేవస్థానంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. నగదు ప్రోత్సాహక బహుమతులను పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పొన్నాపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన హరికృష్ణ, నాగదుర్గ, అభిలాష్, సిద్దు, ధరణి, లక్ష్మి, అడుగుల చంద్రశేఖర ఆచారి, సౌగంధికలను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు సంఘ సహకారం ఉంటుందన్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి పాల్గొని మాట్లాడుతూ సంఘం అభివృద్ధి చెందాలంటే విద్యాపరంగానే సాధ్యమన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహాచారి, చింతలపూడి వీరయ్య, హరిబాబు, దేవరకొండ నాగేశ్వరరావు, బహునాథం, నాగచారి, సుబ్బారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి అద్దంకి

పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు ఘనంగా ఆ పార్టీ శ్రేణులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మాయపాలెం, జార్లపాలెం, నాగులపాడు తదితర గ్రామాలలో పార్టీ అభిమానులు జెండాను ఆవిష్కరించారు. పట్టణంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు కాకానిపాలెం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందమూరి కళా పరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత ఊహించారు. డాక్టర్ సింగ్ విజయ రామారావు, డాక్టర్ ఫణీంద్రబాబు, మహిళల చేత జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ ఫణీంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ రంగంలోనే కాక రాజకీయ రంగంలో కూడా రారాజుగా వెలుగొందిన యుగ పురుషుడు అని అన్నారు. డాక్టర్ సింగ్ విజయ రాఘవరావు మాట్లాడుతూ అన్న బాల్యం నుండే కష్టంతో పైకి వచ్చిన శ్రమజీవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు సందరెడ్డి శ్రీనివాసరావు, కాకాని అశోక్, మాజీ జడ్పిటిసి సభ్యురాలు సింగ్ సుబ్బాయమ్మ, మాజీ పంచాయతీ ప్రెసిడెంట్ పొడపాటి మోహన్‌రావు, కౌన్సిలర్ మాగులూరి తిరుపతమ్మ, కంప రజిని, అడ్వకేట్ చదలవాడ గృహలక్ష్మి అడ్వకేట్ కాకాని అమృతలక్ష్మి, కాకాని లక్ష్మీ నాగేశ్వరమ్మ, మోత్కూరు సుభాష్‌బాబు, చేబ్రోలు వెంకట సుబ్బయ్య, గోవాడ శ్రీకాంత్, శ్రీనివాసరావు, కుందారపు రామారావు, అత్తులూరు రమేష్‌బాబు, కాకాని శ్రీనివాస రావు, నర్రా సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు శతజయంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు కేక్ కట్ చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు జిపి రామారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి అని వ్యాఖ్యానించారు. ఆయన క్రమశిక్షణ టిడిపి శ్రేణులకు స్ఫూర్తి కావాలన్నారు. సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్ సాధించిన విజయాలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మేకా పూర్ణచంద్రరావు, తాడిపర్తి మల్లిఖార్జునరావు, షేక్ బాషా, షేక్ మొహిద్దీన్, షేక్ కరీముల్లా, కండవీటి అగస్త్య, చెన్ను నాగమల్లేశ్వరరావు, దాసరి అమరనాథ్, దున్నా జయప్రద, మోర్ల అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి శ్రేణులు

పంగులూరు: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు శత జయంతి వేడుకలు ఆదివారం మండలంలోని జాగర్లమూడివారి పాలెం గ్రామంలో ఘనంగా జరిగాయి. ధూళిపాళ్ల వీరనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు జాగర్లమూడి పూర్ణచంద్రరావు, జాగర్లమూడి హరికృష్ణ, గొట్టిపాటి భాస్కరరావు, కూనం కిశోర్, ధూళిపాళ్ల సుబ్బారావు, జాగర్లమూడి నందనరావు, జాగర్లమూడి మోహనరావు, కోటేశ్వరరావు, ప్రసాదరావు, కృష్ణమూర్తి, ఎన్టీఆర్ అభిమానులు ఆయన పుట్టినరోజు వేడుకలను విశేషంగా జరుపుకున్నారు. గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అలవలపాడులో..

నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు ఆదివారం సాయంత్రం పంగులూరు మండలంలోని అలవలపాడు గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోమటి ప్రసాద్, గొట్టిపాటి కోటేశ్వరరావు, ఇంటూరి శ్రీనివాసరావు, గొట్టిపాటి కొండలు, ఎర్రమనేని శివాజీ, బాచిన అంజయ్య తదితరులు నాయకత్వం వహించారు.

రేపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భట్టిప్రోలు: టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రం భట్టిప్రోలులో మార్కెట్ యార్డ్ వద్ద గల ఆయన విగ్రహానికి గ్రామ టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఐలవరం, వెల్లటూరు, పల్లెకొన, పెదపులివర్రు గ్రామాలలో ఆయా గ్రామ పార్టీ నాయకులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజుద్దీన్, జయశీలరావు, లెనిన్, మాచర్ల నాగరాజు, దీపాల శివ ప్రసాద్, అనగాని ఏడుకొండలు, పి శంకరరావు, రాయన ప్రసాద్, వేజెళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరులో ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బొమ్మల సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ చేసిన సేవలను కొనియాడారు. భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, ఏవి కృష్ణ, మక్కెన శేఖర్‌బాబు, కోడూరి శేషబ్రహ్మాచారి, మానం హరిబాబు, తులసి శ్రీనివాసరావు, కొరిటాల సురేష్, రామారావు, వెంకటసుబ్బారావు, సమీర్, ఖాజావలి, బషీర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు, పంగులూరు మండలం జాగర్లమూడివారిపాలెంలో నివాళి, పర్చూరులో ఎన్టిఆర్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

పల్లెకోనలో నాటకోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పల్లెకోన గ్రామంలో ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో ఆదివారం నుంచి పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ డి రామానాయుడు అఖిల భారత 31వ ఆహ్వాన నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. ట్రస్టు చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వెంకటేశ్వరరావు కుమారుడు రఘుబాబు స్మారక నాటకోత్సవాలను 2009 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించి రఘుబాబు నడయాడిన ప్రాంతం పల్లెకోనలో 2010 నుంచి 2019 వరకు విర్విఘ్నంగా కొనసాగాయి. కరోనా కారణంగా రెండేళ్ల పాటు నాటకోత్సవాలు నిలిపివేసి 2022లో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించి పరిస్థితులు అనుకూలించటంతో ఈ ఏడాది నుంచి పల్లెకోనలో ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి 6.30 నిమిషాలకు హైదరాబాద్ శ్రీ కళా నికేతన్ వారి "ఎర్రకలువ" నాటకం ప్రదర్శించారు. రచన భాస్కర్ చంద్ర, దర్శకత్వం వెంకట్ గోవాడ నిర్వహించారు. కాగా భట్టిప్రోలు మండలంతో పాటు ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు ఈ నాటకోత్సవాలు తిలకించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్యంగా ఈ నాటక పోటీలు ప్రతి ఏటా ఏప్రిల్ 28 నుంచి మే1 వరకు జరిగేవని, ఈ ఏడాది నందమూరి తారకరామారావు జయంతి 28న ప్రారంభించి సినీ హీరో ఘట్టమనేని కృష్ణ జయంతి 31న ముగించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పరుచూరి రఘుబాబు లోగో

రహదారి చదును చేస్తున్న ప్రొక్లైన్

కోనేటిపురంలో డొంక రోడ్లు అభివృద్ధి

ప్రజాశక్తి-భట్టిప్రోలు: మండలంలోని కోనేటిపురం గ్రామంలో రైతుల సౌకర్యార్థం డొంక రోడ్ల అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా డొంకరోడ్లు గుంతలు పడిపోయి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున చొరవతో వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి పొలాలకు వెళ్లే రోడ్లను ఇటుకరాయి, మొరుము తోలించి జెసీబీతో చదును చేయించినట్లు తెలిపారు. శ్మశాన భూమికి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో రబ్బీసుతో రహదారి అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ వెంకటేశ్వరమ్మ తెలిపారు.

30న రైతుల ఖాతాల్లోకి 'భరోసా'

- జాబితాలు సిద్ధం
- జిల్లాలో 2,84,113 మంది రైతులకు రూ.156.71 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం రైతు భరోసా ప్రకటన చేసింది. ఈనెల 30న రైతు భరోసా కింద రూ.7500 చొప్పున ఒక్కో రైతు ఖాతాకు జమ చేయనుంది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని కర్నూలు జిల్లాలో ప్రారం భించనున్నారు. దీంతో రైతుల్లో కొంత మేరకు ఆశలు చిగురిస్తున్నాయి.

కాస్త ఊరట..

మే నెలలో వర్షాలు పడటంతో రైతులు దుక్కులు దున్ని భూములను పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాల పంపిణీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను ప్రారం భించింది. చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు కూడా కొనలేక అవస్థలు పడుతున్నారు. మే నెలలో ప్రతి ఏటా ఇచ్చే రైతు భరోసా పైనా ప్రకటన లేకుండా ఉంది. ఇ సమయంలో ప్రభుత్వం రైతు భరోసా ఈనెల 30న ఇవ్వడానికి సిద్ధపడినట్టు ప్రకటన రావడంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లు అయ్యింది. మొదటి విడత కింద ఇచ్చే రూ. 7500 ఒక్కో రైతుకు ఇవ్వనున్నారు. దీంతో విత్తనాలు, దుక్కల వరకైనా కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

అందనున్న రూ. 156 కోట్లు..

ప్రకాశం జిల్లాలో 2,84,113 మంది రైతులు రైతు భరోసా పథకానికి అర్హులుగా ఉన్నారు. వారందికీ కలిపి మొత్తం రూ.156.71 కోట్లు రైతు భరోసా పథకం ద్వారా అందనున్నాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేశారు. నియోజకవర్గాల వారీగా సైతం జాబితా సిద్ధంగా అయ్యాయి. యర్రగొండపాలెం నియోజకవరర్గం పరిధిలో మొత్తం 41,090 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.23.02 కోట్లు, సంతనూతలపాడు నియోజకవర్గంలో 29,972 మంది రైతులకు రూ.16.48 కోట్లు, ఒంగోలు నియోజకవర్గంలో 10,355 మంది రైతులకు రూ.5.70 కోట్లు, మార్కాపురం నియోజకవర్గంలో 33,716 మంది రైతులకు రూ.18.54 కోట్లు, కొండపి నియోజకవర్గం పరిధిలో 39,533 మంది రైతులకు రూ.21.74 కోట్లు, కనిగిరి నియోజకవర్గలో 44,263 మంది రైతులకు రూ.24.34 కోట్లు, గిద్దలూరు నియోజకవర్గలో 41,815 మంది రైతులకు రూ.23.00 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 43,369 మంది రైతులకు రూ. 23.88 కోట్ల సాయం అందనుంది.

నష్టపరిహారం కూడా అందితే..

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా కురిసిన వర్షాల, గాలుల వల్ల రైతులు పంటలు నష్టపోయారు. ప్రకతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇంకా పరిహారం అందలేదు. ఈ పరిహారం కూడా సీజన్ ప్రారంభంలోపు అందితే రైతులకు మరింత ప్రయోజనంగా ఉంటుంది. నష్టపరిహారం చెల్లింపుపై ప్రభుత్వం వైపు నుంచి అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు.

రైతు భరోసాతో కొంత మేరకు ఊరట

గర్నెపూడి సైమన్, యర్రగొండపాలెం

అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఖరీఫ్‌లో పంట పొలాలు బాగు చేసుకునేందుకు రైతు భరోసా నగదు కొంత మేరకు ఊరట కలిగించనుంది. ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే భరోసా నిధులు మంజూరు చేయనుండటం సంతోషకరం.

భరోసా నిధులు త్వరగా జమ కావాలి

తాటి నాగేశ్వరరావు, వేగినాటి కోటయ్య నగర్

ప్రభుత్వం పంపిణీ చేయనున్న రైతు భరోసా నిధులు వారంలోపే జమ అయితే మంచిది. సాంకేతిక సమస్యలంటూ కొంతమంది రైతులకు 20 రోజులు వరకు గతంలో రైతు భరోసా నిధులు పడలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలా కాకుండా అర్హులందరికీ వారంలోపే భరోసా నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

చిన్నారి జన్మదిన వేడుకల్లో బూచేపల్లి వెంకాయమ్మ

చిన్నారికి బూచేపల్లి ఆశీర్వాదం

దర్శి : దర్శికి చెందిన వైసిపి నాయకులు బీరం వెంకటేశ్వరరెడ్డి శివపార్వతి దంపతుల మనుమడు లక్షిత్‌రెడ్డి మొదటి జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని లక్ష్మిత్ రెడ్డిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టరు డాక్టర్ ఎస్‌ఎం.బాషా, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ కెవిరెడ్డి, మాజీ ఎంపిపి ఇత్తడి దేవదానం, నాయకులు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, బాపిరెడ్డి, కౌన్సిలరు మోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

దర్శి : విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, పాటలు, డ్రాయింగ్, నీతికథలు, డ్యాన్స్, దేశభక్తి తదితర అంశాల్లో నైపుణ్యం పెంపొందించాలని ఝాన్సీ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ కోటిరెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో దర్శి చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో బాలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు శేషాశైలజ పెయింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ క్లబ్ రాష్ట్ర నాయకురాలు కె. రమాదేవి, ప్రజాసంఘాల నాయకులు కెవి.పిచ్చయ్య, ఉప్పు రమాదేవి, నారాయణ, నాగేశ్వరరావు, కావ్య, వర్షిత, రవితేజ, పవన్‌కుమార్, నాని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట..

- 20 రోజులుగా సాగర్ నీరు బంద్
- పట్టించుకోని అధికారులు
- ఎమ్మెల్యే స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు వేడుకోలు

ప్రజాశక్తి-పిసిపల్లి

సాగర్ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గత 20 రోజులుగా నీరు సరఫరా కాలేదు. దీంతో ఏమి చేయాలో పాలు పోక ప్రజలు లబోదిబో మంటున్నారు. గంత్యరం లేక ట్యాంకర్ల ద్వారా నీటి కొనుగోలు చేసి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవిలో నీటి సమస్యల తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అచరణలో అది అమలు కావడం లేదు. నీటి సమస్య పరిష్కారం గురించి ప్రజలకు సమాధానం చెప్పలేక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ముఖం చాట ేస్తున్నారు. తాగునీటి సరఫరా గురించి సృష్టంగా చెప్పలేకపోతున్నారు. తరచూ పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రభుత్వం బిల్లులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా స్పందించడం లేదు. బిల్లులు సక్రమంగా చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్లు తరచూ మారుతున్నారు. పిసిపల్లిలో కొంత ప్రాంతానికి సాగర్ నీరే దిక్కు. అక్కడ బోర్లు వేసినప్పటికీ నీరు పడటం లేదు. కొన్ని గృహాలు మెరక ప్రాంతాల్లో ఉండటంలో పంచాయతీ ద్వారా సరఫఱా చేసే నీరు వారి అందడం లేదు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్ళే ప్రాంతంలో సుమారు 20 ఇళ్లకు సాగర్ నీరే దిక్కు. పిసిపల్లిలో కిడ్నీ బాధితులు అధికంగా ఉండటంతో స్పందించిన ప్రభుత్వం రోజు సాగర్ నీటిని విడుదల చేసే విధంగా పైపులైన్ ఏర్పాటు చేసింది. అయినప్పటికీ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. వారానికి ఒక్క సారి సరఫరా చేస్తున్న సాగర్ నీటి ప్రజలు పట్టుకొని పొదుపుగా వినియోగించుకుంటున్నారు. రామతీర్థం నుంచి పిసిపల్లికి వచ్చే మార్గంలో పైపులైన్ మరమ్మతులకు గురవుతోంది. దీంతో నెలకు మూడు రోజులకు మించి నీరు సరఫరా కావడం లేదు. ఈ నెల 8న పిసిపల్లిలో సాగర్ నీరు సరఫరా చేశారు. తర్వాత విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం గుంతలు తీసే క్రమంలో పైపులైన్ పగిలిపోయింది. రామ తీర్థంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని కొన్ని రోజులు, గాలి వానకు విద్యుత్ వైర్లు తెగి పోయాయని కొంత కాలం నీరు సరఫరా చేయలేదు. దీంతో ప్రజలు నీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చు కుంటున్నారు.

ట్యాంకరు నీరు రూ.450

టి.రాజ్యం, పిసిపల్లి

గత 10 రోజులుగా సాగర్ నీరు సరఫరా చేయలేదు. నీటి కోసం అవస్థలు పడుతున్నాం. గంత్యరం లేక ట్యాంకర్ నీటిని రూ.450 కొనుగోలు చేసి దాహార్తీని తీర్చుకుంటున్నాం. దీంతో ఆర్థిక భారం తప్పడం లేదు. అధికారులు స్పందించి పైపులైన్‌ను మరమ్మతులు చేపట్టి తాగునీరు సక్రమంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గిరిజనుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని అల్లిపాలెం గిరిజన గూడేన్ని మంత్రి సురేష్ ఆదివారం సందర్శించారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న చెంచు గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా 59 ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంంత్రి సురేష్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో మీకు ఇచ్చిన మాట ప్రకారం నేరుగా చెంచుగూడేనికే వచ్చి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.గృహాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతరించిపోతున్న గిరిజన సంతతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

అల్లిపాలెం గిరిజన గూడెంలో గడప గడపకూ

అల్లిపాలెం గిరిజన గూడెంలో మంత్రి సురేష్ నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గిరిజనులు నీరాజనాలు పలికారు. మంత్రి సురేష్ ఇంటింటికి తిరిగారు. గిరిజనులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ, ఐటిడిఎ, ఇతర శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధిని ఐటిడిఎను ఏర్పాటు చేసి అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రతి గిరిజనుడిని రైతును చేయాలన్నదే లక్ష్యంగా రాష్ట్ర పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. రహదారులు, పక్కా గృహాలు, మంచినీరు, విద్యా, వైద్య సౌకర్యాలు వేగవంతంగా కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఐటిడిఎ పీవో డాక్టర్ బి.రవీంద్రారెడ్డి, ఎఎంసి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ రంగసుబ్బ రాయుడు, తహశీల్దారు దాసు, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, గంజివారిపల్లి సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

డైనింగ్ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో గల శాంతినగర్, దద్దనాల, గాంధీ నగర్ చెంచు గూడేలకు సంబంధించిన ఆశ్రమ పాఠశాలలో డైనింగ్ హాలు నిర్మాణానికి షార్ప్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పి టిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, గంజివారిపల్లి సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, షార్ప్ సంస్థ అసోసియేట్ ప్రాజెక్ట్ మేనేజర్ మారుతి కష్ణ, టీం సభ్యులు తదితరలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి


స్థానికులతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

పేదల సంక్షేమానికి కృషి : వరికూటి

ప్రజాశక్తి- జరుగుమల్లి

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని రెడ్డిపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెఎస్‌సి మండల కన్వీనరు తాటికొండ రామచంద్రరావు, నల్లూరి సురేంద్ర, ఎఎంసి డైరెక్టరు పల్లాల శివకోటి రెడ్డి, రెడ్డిపాలెం గ్రామ సర్పంచి సోము సరస్వతి, వైసిపి నాయకులు సోము సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ పల్లాల పిచ్చమ్మ, కసుకుర్తి బద్రి, సోము కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కొనకనమిట్ల : మండల పరిధిలోని నాగరాజుకుంట గ్రామంలో సర్పంచి కామసాని వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి వెంకటసుబ్బారెడ్డి వేసవి నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రం వద్ద ప్రతి రోజు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి -పొన్నలూరు

పొన్నలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలంటీర్లకు సోమవారం పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపిడిఒ రత్నజ్యోతి తెలిపారు. అనంతరం పొన్నలూరులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొనాలని ఎంపిడిఒ కోరారు.

మాట్లాడుతున్న డాక్టర్ హరిబాబు

మానవత స్వచ్ఛంద సంస్థను జనంలోకి తీసుకెళ్లాలి : డాక్టర్

ప్రజాశక్తి సింగరాయకొండ

మానవత స్వచ్ఛంద సంస్థను జనంలోకి తీసుకుపోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హరిబాబు తెలిపారు. ప్రభుత్వ హైస్కూల్లో మానవత స్వచ్ఛంద సంస్థ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ జనంలోకి తీసుకుపోవాలన్నారు. సంస్థ యొక్క ఆశయాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో సర్పంచులకు, ఎంపిటిసిలకు అవగాహన కల్పించి ప్రజల్లోకి తీసుకుపోయే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెట్టి సూర్య చంద్రశేఖర్‌రెడ్డి, కోటపాటి నారాయణ, ఎం.బాబూరావు, ఎం.నరసింహారావు, పి.కోటేశ్వరరావు, ఎస్. సునీల్‌కుమార్‌రెడ్డి, సి.హెచ్. సుధాకర్‌రెడ్డి, నాగార్జున ప్రతాప్‌రెడ్డి, జైపాల్ భాస్కర్, కొండయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, పట్టణ కార్యదర్శి వెంకట్రావు, నాయకులు గురిజేపల్లి జిలాని, షేక్ వలి, చిట్టేల వెంగళరెడ్డి, భాస్కర్, రామచంద్రయ్య, కామేపల్లి వెంకటేశ్వర్లు, కంచర్ల సత్యనారాయణ గౌడ్, కొత్తమాసు సుబ్రమణ్యం, గురిజేపల్లి నారాయణరెడ్డి, తోట మహేష్ నాయుడు, కిశోర్ పాల్గొన్నారు. **వెలిగండ్ల :** టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మీదుగా కాశయ్య, మొటాటి సుబ్బారెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, దారెడ్డి సుబ్బారెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, బత్తుల తిరుపతిరెడ్డి, తీట్ల లక్ష్మీనారాయణ, ముక్కు వెంకటేశ్వర్‌రెడ్డి, బత్తుల నారాయణరెడ్డి, పోకల పుల్లారెడ్డి, నాగరాజు, ముక్కు వెంకటేశ్వర్‌రెడ్డి, గుంటక జయరామిరెడ్డి, వెంకటయ్య, టి.సుబ్రమణ్యం, కేసరి రమణారెడ్డి, దేవా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొండపి :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపిలో బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్, దామచర్ల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. గోగినేనివారిపాలెంలో సర్పంచి కొమ్మాలపాటి లచ్చెరుసు, చింతల వెంకటేశ్వర్లు, బొద్దులూరి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా నాయకులు రావిపాటి సీతమ్మ, వసంతరావు, మండల యూత్ అధ్యక్షుడు కాలేషా, దామా మురళి, బి.సోమయ్య, పెద్దోడు, దేవూరి మస్తాన్, కాశయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **జరుగుమల్లి :** మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో మాజీ సర్పంచి ఏలూరు రాంబాబు ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి. రామారావు శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి ఏలూరి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఘంటా చిరంజీవి, రావూరి సుబ్బారావు, మల్లెల హరిబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మద్దిపాడు :** మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు, మద్దిపాడు, నందిపాడు, గుండ్లపల్లి, మల్లవరం గ్రామాల్లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంతి బాబు మాట్లాడుతూ రాజకీయ రంగంలో ప్రభంజనం సృష్టించిన మహానేత ఎన్‌టిఆర్ అని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఏడుగుండ్లపాడు మాజీ సర్పంచి ఎం. హరి ప్రసాద్‌రావు, మేడూరు నాగేశ్వరరావు, ఆలా శ్రీరాములు, సీతారామయ్య, సర్పంచి దాసరి శిల్పా సౌందర్య, దాసరి రమేష్ బాబు, దేవ బత్తిన ప్రసాద్, రావి నరసింహారావు, చింతల శ్రీనివాసరావు, నాగన్నపాలెం సర్పంచి కాకర్ల విజయకుమార్, చెరుకూరి వాసు బాబు, అడ్డాల వాసు, నందిపాడు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **టంగుటూరు :** టంగుటూరు బస్ స్టాప్ సెంటర్‌లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు కామని నాగశ్రీను, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచి ముక్కెన కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, టిడిపి ప్రధాన కార్యదర్శి మేడికొండ రవీంద్ర, నాయకులు సవలం సుధాకర్, కొమ్ము చిట్టి, కోటి, దామతోటి వంశీ, అనిల్ కుమార్, మేడికొండ శ్రీనివాసరావు, పాల్గొన్నారు. **శింగరాయకొండ :** టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, వేల్పుల సింగయ్య, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మించల బ్రహ్మయ్య, సందని బాషా, ఇమ్మడిశెట్టి రామారావు, కల్లగుంట నరసింహ, షేక్.అబ్దుల్‌సుబాన్, కనిగిరి వెంకటేశ్వర్లు, సుదర్శి ప్రసాద్‌రావు, శీలం సుబ్రహ్మణ్యం, మేకల నరేష్ తదితరులు పాల్గొన్నారు. **పామూరు :** మండల పరిధిలోని కంభాలదిన్నె గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు శతజయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బొల్లా నరసింహారావు, గోళ్ళ వీరబాబు, ఇర్రి కోటిరెడ్డి, తడికమళ్ల సుబ్బారావు, మాలకొండరాయుడు, శేషం మోషే, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కనిగిరి :** స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలను టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకుడు షేక్ ఫిరోజ్, ముచ్చుమారి చెంచిరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ఆర్‌వి. నారాయణ, పాలూరి సత్యం తదితరులు పాల్గొన్నారు. **పొదిలి :** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టిడిపి, ముస్లిం మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి కాటూరి నారాయణ బాబు, మాజీ సర్పంచి కాటూరి నారాయణ ప్రతాప్,టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, జిల్లా ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్, అధికార ప్రతినిధి యాసీన్, పట్టణ మండల అధ్యక్షులు ముల్లా ఖుద్దున్, మీగడ ఓబుల్ రెడ్డి, లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ షబ్బీర్, శివాలయం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి , పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఇమాంసా, ముల్లా, షబ్బీర్, షేక్ ఖాసీం, గౌస్, మార్కాపురం నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ, కాటూరి శీను, షేక్ షహనాజ్, సోమిశెట్టి శ్రీదేవి మేహరున్నిసా, మల్లి, పోవూరి నరేష్, అంజిరెడ్డి, షేక్ అల్లా బకాష్, జిలాని, బుజ్జి, కాలేషా,ముల్లా ఖయూమ్, సంధాని పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** టిడిపి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు బొద్దు శంకర్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తాటితోటి నరసింహారావు , మాజీ జడ్‌పిటిసి తనీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచి రంపతోటి అంకారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ముప్పరాజు శ్రీనివాసరావు , ప్రధాన కార్యదర్శి మార్పూడి జనార్ధన్, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు మాధవీలత, సొసైటీ మాజీ అధ్యక్షుడు సాధినేని శ్రీరామమూర్తి, టిఎన్‌టియుసి మండల అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నారాయణస్వామి చౌదరి పాల్గొన్నారు. **ఒంగోలు సబర్బన్ :** ఒంగోలు నగరపరిధిలోని కొప్పోలు గ్రామంలో ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్పాహారం అందజేశారు. ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర గురించి ప్రజలకు వివరించారు.

శింగరాయకొండలో కేక కట్ చేస్తున్న నాయకులు

జరుగుమల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కొప్పోలులో నగదు పురస్కారం అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

విద్యార్థినికి నగదు పురస్కారం అందజేత

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా పదో తరగతి పరీక్షల్లో 550/600 మార్కులు సాధించిన కొప్పోలులోని బివిఆర్ ఎయిడెట్ స్కూల్ విద్యార్థిని మెట్లే విజయ నాగరాజశ్రీకి రూ.2వేల నగదు పురస్కారాన్ని దాత, పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ నాగేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కాట్రగడ్డ రఘు, నాయకులు బత్తిన కృష్ణమూర్తి, వీరంగథం శ్రీనివాసరావు, వీరగంథం రాంబాబు, మాదాల ఓంకార్, జి.శ్రీనివాసులు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

వెలిగండ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

కనిగిరిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి

7

సోమవారం 29 మే 2023

ప్రమాద సమయాల్లో ప్రజలు సహాయక చర్యల్లో పాల్గొనాలి

ఫోటోలు, వీడియోలు తీస్తూ కాలక్షేపం చెయ్యొద్దు ● మానవత్వం చాటి ప్రాణాలు కాపాడండి: సిఐ విజయచంద్ర

ప్రజాశక్తి-రేపల్లె

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారి పట్ల ప్రజలు ప్రవర్తిస్తున్న తీరు విచారకరంగా ఉందని పట్టణ సిఐ విజయచంద్ర అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మానవత్వం మరచి ఫోటోలు, వీడియోలు తీస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడి ఉంటే తక్షణమే సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి, వైద్య సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మనకెందుకులే అనే ధోరణి ప్రజల్లో బాగా పెరిగిందని అన్నారు. పక్కనే వెళుతున్న ప్రయాణికులు తమకెందుకులే అనే నిర్లక్ష్యం చూపుతుండడం వలన మరణాల సంఖ్య అధికమవుతోందని ఆవేదన చెందారు. కొందరు వీడియోలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం విధిగా భావిస్తున్నారన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని మన సొంత కుటుంబ సభ్యులుగా భావించి తక్షణ సాయం అందించాలన్నారు. చివరి క్షణాల్లో ఉన్న వారిని స్పందించి ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చున్నారు. సాటి మనిషిగా మానవత్వంతో, సహృదయంతో మనకెందుకులే అని వెళ్లకుండా రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారికి సాయం చేయడంలో ముందుండాలని సీఐ విజయచంద్ర కోరారు.

మాట్లాడుతున్న సిఐ విజయచంద్ర

ఒత్తిడితో డ్రైవింగ్.. ప్రాణాలతో చెలగాటం

మితిమీరిన వేగం వ్యక్తుల ప్రాణాల మీదకు తెస్తోందని సిఐ విజయచంద్ర అన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసులు, ప్రభుత్వాలు ఎన్నో రకాల భద్రతా చర్యలను చేపడుతూ, అమలు చేస్తున్నప్పటికీ, ప్రయోజనం కనిపించడంలేదని అన్నారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబ సభ్యులను ఆదుకున్నప్పటికీ మరణించిన వారి లోటు పూడ్చలేనిదన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో ఎక్కువగా 18 నుంచి 35 ఏళ్ల వయసులోపు వారు కావటం బాధాకరమని అన్నారు. పోలీసులు ఎన్నిసార్లు కౌన్సెలింగ్ చేసినా, ఎన్ని జరిమానాలు విధించినా యువకుల వేడిరక్తం ముందు అవి ఏవీ పనిచేయడంలేదన్నారు. ప్రజల ప్రాణాలు బలిగొంటున్న రోడ్డు ప్రమాదాల నివారణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే కొంతమేర ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ప్రయాణం చేసే సమయంలో వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పూర్తి స్థాయిలో పాటించాలన్నారు. వేగంకన్నా ప్రాణం ముఖ్యం అని గుర్తించాలని కోరారు. కొందరు మద్యం తాగి డ్రైవ్ చేసి మరణిస్తే, మరికొందరు డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. మరికొందరు గమ్యానికి త్వరగా చేరాలనే ఒత్తిడితో డ్రైవింగ్ చేస్తూ మృత్యువాత పడుతున్నారని చెప్పారు. ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా స్వీకరించి ప్రమాదంలో గాయపడిన వారికి అండగా ఉండి తక్షణ వైద్య సేవలు అందించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కథా రచయితకు సాహితీ ప్రియుల స్వాగతం

ప్రజాశక్తి-అద్దంకి

ప్రముఖ కథా రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి అద్దంకి పట్టణాన్ని సందర్శించారు. మరో గ్రంథాలయ ఉద్యమం నిర్మిద్దాం రండి అనే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న అన్ని గ్రంథాలయాలను మోటర్ సైకిల్ యాత్ర ద్వారా సందర్శిస్తున్నారు. సృజన సాహితీ మిత్రులు, రోటరీ సభ్యులు, పుస్తక ప్రేమికులు మంచికంటికి ఆదివారం స్వాగతం పలికారు. పుస్తకం బాలబాలికలకు, యువతకు, విద్యార్థినీ విద్యార్థులకు దగ్గర కావాలని, సాహిత్యం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకోవాలని ఆకాంక్షించారు. పుస్తకమే అన్నీ నేర్పిస్తుందని పుస్తకాన్ని యువతకు పరిచయం చేయాలని ఆయన కోరారు. మంచికంటి వెంకటేశ్వర రెడ్డి మోటార్ సైకిల్ యాత్ర విజయవంతం కావాలని, గ్రంథాలయాలకు పూర్వ వైభవం రావాలని ఆయనకు సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పట్టణంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం జరగాలని, సాహితీ మిత్రుల కల నెరవేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు సుగుణరావు, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకర్ దత్ దంపతులు, రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, కె అనిల కుమార సూరి, ఇలపావులూరి శేషతల్ప సాయి, షేక్ మహమ్మద్ రఫీ, చెన్నుపాటి రామాంజనేయులు, జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డివిఎం సత్యనారాయణ, లక్కరాజు చంద్రశేఖర్, మందా జోసెఫ్, అద్దంకి లెవి ప్రసాద్, చుండూరి మురళీ సుధాకర్, పిసిహెచ్ కోటయ్య, సృజన సభ్యులు పాల్గొన్నారు.

ప్రముఖ కథా రచయిత మంచికంటి వెంకటేశ్వర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం

పంట పొలాల్లోనే ఉన్న వరి కుప్పలు

కూలీల కొరతతో పొలాల్లోనే వరికుప్పలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు: రబీ సీజన్ ముగిసిపోయి మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్నా నేటికీ గత ఖరీఫ్ వరి కుప్పలు పంటపొలాల్లోనే ఉండిపోయాయి. నిన్న, మొన్నటి వరకు రబీలో జొన్న, మొక్కజొన్న పంటల పనులతో బిజీగా ఉన్న కూలీలు ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకోవటంతో వరి కుప్పలు నూర్పిడి చేసేందుకు కూలీలు రాకపోవటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు నిలబడి నూర్పిడి చేసేందుకు అవకాశం లేక ఇబ్బంది పడిన రైతాంగానికి ఎండలు ముదిరి వడగాల్పులు వీస్తుండటంతో పనులు చేసేందుకు కూలీలు జంకుతున్నారు. జూన్ మరో రెండు రోజుల్లో జూన్ నెల ప్రారంభం కావస్తుండటంతో వర్షాలు అధికమైతే కుప్పల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాలలో వరి పంట సాగుచేయగా కొంత భాగం హార్వెస్టలతో కోతలు చేపట్టగా, మరి కొంత భాగం మొక్కజొన్న పంట లేత దశలో నూర్పిడి చేపట్టారు. ప్రస్తుతం 30 శాతం పైగా కుప్పలు పొలాల్లోనే ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఐలవరం, అద్దేపల్లి, సురేపల్లి, కొనేటిపురం, పల్లెకోన గ్రామాలలో కుప్పలు అధికంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

సర్టిఫికెట్లను అందజేస్తున్న డాక్టర్ అమృతపాణి

కంటి వైద్యం పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-చీరాల

కంటి వైద్యం పట్ల గ్రామీణ వైద్యులు అవగాహన కలిగి ఉండాలని కంటి వైద్య నిపుణులు డాక్టర్ వరికూటి అమృతపాణి అన్నారు. ఆదివారం గ్రామీణ వైద్యులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక అమ్మ కంటి వైద్యశాలలో గ్రామీణ వైద్యులకు నిర్వహించి మాట్లాడారు. కండ్లకలకపై గ్రామీణ వైద్యులను ఆశ్రయించే వారికి తగు జాగ్రత్తలు, సూచనలు చేయాలని అన్నారు. ప్రస్తుతం కండ్లకలక సీజన్ ఉన్నందున ఎక్కువ రిస్క్ తీసుకోకుండా రోగిని కంటి వైద్యుని వద్దకు పంపించి సరైన సమయంలో సరైన వైద్యాన్ని వారికి అందించాలని సూచించారు. 45 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ చత్వారం వస్తుందని, తగు జాగ్రత్తలు తీసుకుంటూ కళ్లజోడు పెట్టుకుంటూ ప్రతి ఏటా వైద్యుని వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. శిక్షణ అనంతరం గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు, ఆర్ శ్రీనివాసరావు, పలువురు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో ఉన్న రోగులకు నాగభైరు గాయత్రి ఆర్థిక సాయంతో పండ్లు, రొట్టెలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ గురు మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైద్యశాలకు అవసరమైన మంచి నీటిని నిరంతరం అందించటంతో పాటు ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలు అందించటంపట్ల క్లబ్ సభ్యులను అభినందించారు. రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోట శ్రీనివాసరావు, మున్నంగి వెంకటసుబ్బయ్య, కె ఆంజనేయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నారై గాయత్రి వంశీ జన్మదినం సందర్భంగా రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, పద్మావతి సహకారంతో పర్చూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నూతలపాడులోని ఆశ్రయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు, రొట్టెలు అందజేశారు. గాయత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కోడూరి సుబ్రహ్మణ్యాచారి, ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నాన్న నేను వచ్చేస్తా నాటికలోని ఓ సన్నివేశం

ఆలోచింపజేసిన 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం వీరన్నపాలెంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటికల పోటీలు కళాభిమానులను ఆలోచింపచేస్తున్నాయి. సమాజంలో నేడు జరుగుతున్న పరిణామాలను కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శిస్తున్నారు. న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారి కపిరాజు, శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం, యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి అనుకున్నది ఒక్కటి అయినది ఒక్కటి నాటిక, అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటికలు ప్రదర్శించారు. నేటి సమాజంలో తల్లిదండ్రులు అతి చనువు ఇచ్చి అడిగిందల్లా ఇచ్చుకుంటూ పోతున్నారు. మితిమీరిన ప్రేమ, మమకారాన్ని పెంచుకొని మన పిల్లలేగా అని స్వేచ్ఛను ఇచ్చి పెంచితే దాని ఫలితం పెండ్లి అయిన కొద్ది రోజులకే వివాహ జీవితంలో భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్ధలను పరిష్కరించుకోలేక పోతున్నారు. సంసారంలో సర్దుబాటు, దిద్దుబాటు చేసుకోలేక 'నాన్న నేను వచ్చేస్తా' అంటున్నారని, దానికి స్వస్తి పలికి 'నాన్న మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారు?' అనే రోజులు రావాలని, అప్పుడే వివాహబంధం బలపడి వైవాహిక జీవితం నూరేళ్లు వర్ధిల్లుతుందనే సందేశమే నాటిక సారాంశం.

30న విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఈ నెల 30న బాపట్ల కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి జె రాజ్‌దెబోరా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎట్రాసిటీల నివారణ చట్టం, ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖాధిపతులు సమావేశానికి ఎస్సీ ఎస్టీ కేసులపై నివేదిక సమర్పించాలని ఆమె తెలిపారు.

దండుబాట రోడ్డు.. కంపు కంపు..

ప్రజాశక్తి-చీరాల: పట్టణంలోని దండుబాట రోడ్డులో పారిశుధ్యం అధ్వానంగా తయారయింది. పారిశుధ్యం నిర్వహణ పట్ల చీరాల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. పట్టణంలో సేకరించిన చెత్తాచెదారం, కొబ్బరి బోండాలు, ఇతర ప్లాస్టిక్ సామగ్రి అంతటినీ దండుబాట ప్రాంతంలో రోడ్లపై ఇరువైపులా కుప్పలుగా వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అటువైపుగా ప్రయాణిస్తున్న వాహనదారులకు, బాటసారులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకుప్పలను తీసుకువస్తూ ఆ ప్రాంతంలో డంపు చేయడం వలన అక్కడ నివసించేవారు అనేక అవస్థలు పడుతున్నారు. చెత్తాచెదారం నుంచి వస్తున్న దుర్వాసనతో అంటు రోగాలు వ్యాపిస్తాయని, పసిపిల్లలతో అల్లాడిపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సిబ్బంది సేకరించిన చెత్తను రోడ్ల వెంట వేయకనీయకుండా తమను దుర్వాసన నుంచి కాపాడాలని కోరుతున్నారు.

● వెర్రెమ్మకు బివిఎస్ఆర్ నివాళి

కొల్లూరు మండల పరిధిలోని కిష్కిందపాలెంలో సిపిఎం నాయకులు బిఎల్‌కె ప్రసాద్‌రావు మాతృమూర్తి వెర్రెమ్మ సంస్మరణ సభ ఆదివారం వారి స్వగృహంలో నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని.. వెర్రెమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, సిపిఎం నాయకులు టి.కృష్ణమోహన్, మణిలాల్ ఉన్నారు.

- ప్రజాశక్తి, కొల్లూరు

'మణిపూర్'లో ఆదివాసీ తెగలపై

దాడులు ఆపాలని నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉత్తర ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్లో కుకీ, నాగా ఆదివాసి క్రైస్తవుల మీద దాడులు ఆపాలని, అక్కడ ప్రజాస్వామ్య వాతావరణం నెలకొల్పాలని పలు ప్రజాసంఘాల డిమాండ్ చేశాయి. ఈ మేరకు బహుజన రచయితల వేదిక ప్రజా సంఘాల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి విద్యావేత్త డాక్టర్ నూకతోటి రవి కుమార్, బహుజన రచయితల వేదిక కన్వీనర్ మిరియం అంజిబాబు నేతత్వం వహించారు. హైకోర్టు న్యాయవాది షేక్ కరీముల్లా మాట్లాడుతూ మణిపూర్‌లో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని అక్కడ ఆదివాసి తెగలపై జరుగుతున్న హింసకాండను నిరోధించాలని కోరారు. కవి, రచయిత నబి కె ఖాన్ మాట్లాడుతూ గిరిజన, ఆదివాసీ తెగల మధ్య రిజర్వేషన్ల చిచ్చు అంటించి చర్చిలను తగలేయడం, సామాన్య పౌరులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్, రాష్ట్ర నాయకులు అట్లూరి రాఘవులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళితులు, ఆదివాసీలు, ముస్లిం మైనారిటీల హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు మాట్లాడుతూ పార్లమెంట్ ప్రారంభానికి రాష్ట్రపతినే పిలవలేదంటే దేశంలో ఎటువంటి పాలన అమలవుతున్నదో తెలుసుకోవాలన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో మైనారిటీలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ నాయకులు దాసరి సుందరం మాట్లాడుతూ ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావలసిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు తోరటి ఆనంద్ మాదిగ, దళిత నాయకులు పాలడుగు రమేష్ పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో జర్నలిస్టుల డిమాండ్స్ డే

నిరసనను జయప్రదం చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 29న జర్నలిస్టుల "డిమాండ్స్ డే" జరుగుతుందని, కలెక్టరేట్ వద్ద సోమవారం జరిగే నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరావు, ఎస్‌వి బ్రహ్మం తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, జీవోను సవరించి ప్రతి మండల విలేకరికి అక్రిడిటేషన్ ఇవ్వాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీని నియమించాలన్నారు. జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని, కార్మిక బీమా వర్తింపజేయాలన్నారు. జర్నలిస్టు కమిటీలు, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. మీడియా అకాడమీలో ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టుల అవార్డులు ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా అమలుపై సమీక్షకు కమిటీని నియమించాలనే డిమాండ్లపై జరిగే ఈ నిరసనలో ప్రింట్, బ్రాడ్‌కాస్ట్ మీడియా జర్నలిస్టులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు

మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రాజకీయాలతో పనిలేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారుని ఇంటి వద్దకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగనన్నకు దక్కిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పెద్దదోర్నాలలో బొగ్గరపువారి కల్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామ వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకంతో నియమించిన గ్రామ, వార్డు వాలంటీర్లు అంతే నమ్మకంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని చెప్పారు.

మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లు అంటే సీఎం జగన్‌కు ఎంతో గౌరవం ఉందన్నారు. సచివాలయ వ్యవస్థను మొదట్లో చంద్రబాబు నాయుడు, లోకేష్ విమర్శించారని తెలిపారు. అయితే ప్రస్తుతం దేశం మొత్తం ఆంధ్రరాష్ట్రంలోని సచివాలయాల వైపు చూస్తుందని చెప్పారు. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని తెలిపారు. అనంతరం సేవా వజ్ర అవార్డును పెద్దబోమ్మలాపురం గ్రామానికి చెందిన బేతం అవరోన్, సేవారత్న అవార్డులను చిన్నగుడిపాడుకు చెందిన జోగి సాయికృష్ణ, పూర్ణకంటి బాబు, చిన్నదోర్నాలకు చెందిన గుండారెడ్డి కాశిరెడ్డి, దోర్నాల-2కు చెందిన యలకపాటి యోహాను, దోర్నాల 4కు చెందిన ముల్లంగి బాల నారాయణమ్మలకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి లతాబాయి, సర్పంచ్ చిత్తరి హారిక, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిడివో నాసర్‌రెడ్డి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై

5 నుంచి చైతన్య సదస్సులు

వాలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జూన్ ఐదున ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు పర్యావరణ పరిరక్షణ చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు వాలంటీర్ ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ జి.వీరభద్రాచారి తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ అంశాలపై ప్రజలకు అవగాహన, చైతన్యం కల్పించేందుకు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ ఐదున మొదటి రోజు 'గ్రీన్ వాక్' (పర్యావరణహిత నడక) అనంతరం పరిశ్రమల కాలుష్యం, సహజ వనరులు, అటవీ సంరక్షణపై సదస్సు జరుగుతుందన్నారు. 6న గ్రీన్ సైకిల్ ర్యాలీ, అనంతరం పచ్చదనం పరిశుభ్రత, ప్లాస్టిక్ వ్యతిరేక ప్రత్యామ్నాయాల అన్వేషణ, ఆహార భద్రతపై సదస్సు జరుగుతుందన్నారు. 7వ తేదీ 'వాహన సెలవు దినం' అనంతరం ఇంధన పొదుపు, వాహన, వాయు కాలుష్యం ప్రత్యామ్నాయాలుగా ఉన్న సోలార్ విద్యుత్తు, ఈ-బైక్స్ వినియోగంపై సదస్సు ఉంటుందన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు శాసనభ్యులు, మాజీ పర్యావరణ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ మలికా గార్గ్, జిల్లాలోని అధికారులు పాల్గొంటారన్నారు.

ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్‌మేళా

- స్కిల్స్ హబ్స్ ద్వారా నైపుణ్యాల అభివృద్ధి
- యూత్ సర్వేలో నిరుద్యోగుల గుర్తింపు
- త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిరుద్యోగ యువత నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి(డిఎస్‌డిఒ) ఆర్.లోకనాథం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. స్కిల్ హబ్స్ ద్వారా యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ ఐటిఐలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ద్వారా యువతకు అందిస్తున్న సేవలను డిఎస్‌డిఒ వెల్లడించారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభను మరింత పదును పెట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. స్కిల్ కాలేజ్, స్కిల్ హబ్స్ ద్వారా యువతకు అవసరమైన శిక్షణలు ఇస్తున్నాం. శిక్షణతో పాటు వారికి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా

ప్రకాశం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో మెగా జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. 2022 సెప్టెంబర్ నుంచి 2023 మే వరకు ఆరు నియోజకవర్గాలలో మెగా జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాం. సంతనూతలపాడు నియోజకవర్గంలోని మద్దిపాడు ప్రభుత్వ జూనియ్ కళాశాలలో జూన్ 4న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నాం. మార్కాపురం నియోజకవర్గంలో జులైలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నాం.

స్కిల్ హబ్స్‌లో నైపుణ్యాల అభివృద్ధి

జిల్లాలోని 10 స్కిల్ హబ్స్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నాం. ప్రధానమంత్రి కౌశల వికాస యోజన(పిఎంకెవివై) 4.0లో వివిధ శిక్షణలు ఇస్తున్నాం. ఒంగోలులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల(బాలురు), ప్రభుత్వ ఐటిఐ కళాశాల(బాలికలు), న్యాక్ సెంటర్‌లో శిక్షణ ఇస్తున్నాం. బాలికల ఐటిఐలో 4 కోర్సులు, బాలురు ఐటిఐలో 2 కోర్సులకు మొత్తం 120 మందికి శిక్షణ ఇస్తున్నాం. టువీలర్ టెక్నీషియన్, ప్లంబర్ జనరల్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. న్యాక్ సెంటర్‌లో అసోసియేట్ ఎలక్ట్రీషియన్, ప్లంబర్ జనరల్, ఆర్‌ఏసి టెక్నీషియన్, సిసి టివి ఇన్‌స్టాలేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నాం. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోని స్కిల్ హబ్స్‌లో యువతకు ఆయా కోర్సులలో శిక్షణ ఇవ్వటం జరుగుతోంది.

స్కిల్ కాలేజ్‌లో శిక్షణ పూర్తి

ఒంగోలు మంగమ్మ డిగ్రీ కళాశాల ఆవరణలోని స్కిల్ కాలేజ్‌లో డ్యూటీ రిలేషన్ మేనేజర్ కోర్సులో గత ఏడాది 27 మందికి శిక్షణ ఇచ్చి 21 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. గత వారం రెండో విడత శిక్షణ ప్రారంభమైంది.

త్వరలో ఎస్‌డిసి ప్రారంభం

యువతలో సాంకేతిక కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు ఒంగోలు ప్రభుత్వ ఐటిఐ(బాలురు) కళాశాలలోని 4.57 ఎకరాలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఎంపి ల్యాడ్స్‌లో మంజూరైన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏపిఐఐసి నిర్మిస్తోంది. ఈ సెంటర్ పూర్తయితే యువతకు టెక్నికల్ కోర్సులలో శిక్షణ ఇస్తాం.

పాలకుల విధానాలే

వ్యవసాయ సంక్షోభానికి కారణం

సావనీర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పాలకుల పరాధీన విధానాలే వ్యవసాయ సంక్షోభానికి కారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం 2022 వ సంవత్సరపు వార్షిక సంచిక (సావనీర్) ఆవిష్కరణ ఆదివారం జరిగింది. కార్యక్రమానికి రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వేజెండ్ల రామారావు ఈ సావనీర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసాహితీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జివి కృష్ణయ్య, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి, ఎపిటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయ సారధి, ఏఐఎఫ్‌టియు న్యూ నాయకులు ఎంఎస్ సాయి ప్రసంగించారు.